క్లుప్తంగా

నీట్‌లో విద్యార్థుల సత్తా


టి.పూజితాంజలి


సానియా

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవిద్య జూనియర్ కళాశాల విద్యార్థినులు నీట్ ఎంట్రన్స్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ కేటీవీ రమణరావు తెలిపారు. టి.పూజితాంజలి 720 మార్కులకు 626 మార్కులు సాధించి 6,844వ ర్యాంక్, సానియా 554 మార్కులు సాధించి 18,125వ ర్యాంకు పొందారని ఆయన పేర్కొన్నారు. వీరిని కళాశాల డైరెక్టర్లు శ్రీకాంత్‌కుమార్‌రెడ్డి, రామమోహన్ అభినందించారు.

వరదరాజులరెడ్డికి సన్మానం


వరదరాజులరెడ్డిని సన్మానిస్తున్న ఏపీఎన్జీఓస్ అసోసియేషన్ నాయకులు

ప్రొద్దుటూరు : సార్వత్రిక ఎన్నికల్లో ప్రొద్దుటూరు ఎమ్మెల్యేగా విజయం సాధించిన నంద్యాల వరదరాజులరెడ్డిని గురువారం ఏపీఎన్జీఓస్ అసోసియేషన్ తాలూకా అధ్యక్షుడు కేజీ రఘురామిరెడ్డి, కార్యదర్శి జె.రామసుబ్బయ్య, కార్యవర్గ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా వరదరాజులరెడ్డికి వారు పూలమాల వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

బద్వేలు అర్బన్ : పట్టణంలో మడకలవారిపల్లె గ్రామంలో గురువారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. ఈ ఘటనలో ఓ బాలుడితో పాటు పశువులు గాయపడ్డాయి. మడకలవారిపల్లె గ్రామంలో ఇంటి ఎదుట ఆడుకుంటున్న దినేష్‌రెడ్డిపై పిచ్చికుక్క దాడి చేసింది. దీంతో చేతిభాగంలో గాయం కావడంతో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అలాగే గ్రామంలోని పశువులు, మేకలపై కూడా దాడి చేయడంతో అవి గాయపడ్డాయి. ఇటీవల కాలంలో గ్రామంలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని సచివాలయ సిబ్బందికి సమాచారమిచ్చినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోయారు.

ట్రాక్టర్ బ్యాటరీలు చోరీ

రాజుపాళెం : మండలంలోని గాదెగూడూరు గ్రామంలోని నాలుగు ట్రాక్టర్లలో ఉన్న బ్యాటరీలు, రెండు టేపురికార్డులు చోరీకి గురైనట్లు బాధిత రైతులు గురువారం తెలిపారు. కొత్త వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి ఈ చోరీకి పాల్పడి ఉండవచ్చునని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో బ్యాటరీ విలువ దాదాపు రూ.4 వేల వరకు ఉండవచ్చునని, మొత్తం రూ.22 వేలు ఉంటుదన్నారు. దీనిపై రాజుపాళెం పోలీసులకు సమాచారం అందించామని చెప్పారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి


దుకాణంలో స్టాకు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏఓ జాకీర్‌షరీఫ్

కలసపాడు : రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన కలసపాడులో పురుగు మందులు, విత్తనాల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని, అనుమతి లేని పురుగు మందులను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి రోజు స్టాకు రిజిస్టర్లను అప్‌డేట్ చేస్తుండాలని తెలిపారు. దుకాణాల్లో ధరల పట్టిక ఉంచాలన్నారు. అనంతరం స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు.

అగస్త్యేశ్వరునికి భస్మహారతి


భస్మార్చనలో అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో గురువారం అమావాస్య సందర్భంగా ఉజ్జయిని మహాకాళేశ్వరునికి చేసే విధంగా ఘనంగా భస్మహారతి ఇచ్చారు. వేకువజామున అగస్త్యేశ్వరునికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం అగస్త్యేశ్వరుని మూల విరాట్‌ను వేదపండితులు భస్మంతో అభిషేకించారు. అనంతరం భస్మహారతి ఇచ్చి భక్తిశ్రద్ధలతో పరమేశ్వరున్ని ప్రార్థించారు. ప్రతి నెల అమావాస్య రోజున స్వామివారికి భస్మహారతి పూజాకార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు.

పుస్తక పఠనం.. విజ్ఞాన సోపానం

డిజిటల్ యుగంలో పిల్లలు పుస్తక పఠనం మరిచారు. ఆటల పాటల ఊసేలేదు. ఇలాంటి పరిస్థితులను నుంచి బయటపడేసేందుకు గ్రంథాలయ సంస్థ వేసవి వినోదానికి శ్రీకారం చుట్టింది. వేసవి సెలవుల్లో విద్యార్థుల సమయాన్ని వృథా చేయకుండా వారిలో విజ్ఞాన, సృజనాత్మకతను పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచడంతోపాటు, ఆలోచనా దృక్పథాన్ని మెరుగుపరచడంలో గ్రంథాలయాల పాత్ర ఎనలేనిది. సమ్మర్ క్యాంపులో చిన్నారులతో నీతి కథలు చదివించడంతో పాటు ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. పిల్లల మానసిక వికాసానికి సమ్మర్ క్యాంపులు దోహదపడుతున్నాయి.

- గ్రంథాలయాల్లో వేసవి శిబిరాలు
- పిల్లల మానసిక వికాసానికి దోహదం
- పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు
- నేటితో ముగియనున్న క్యాంపులు

మైదుకూరు : వేసవి సెలవుల్లో పిల్లల మానసిక వికాసానికి దోహదపడే విధంగా గ్రంథాలయ సంస్థ మే 15 నుంచి సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించింది. ఈ సమ్మర్ క్యాంప్ శుక్రవారంతో ముగియనుంది. సమ్మర్ క్యాంప్‌లో ఆయా గ్రంథాలయాల్లో పిల్లలకు ఆటల పోటీలు, చెస్, క్యారమ్స్ తదితర గేమ్స్ ఆడించడం చేశారు. విజ్ఞానం, వినోదాన్ని అందించే పుస్తకాలను చదివించారు. దేశ నాయకులు, ప్రముఖ వ్యక్తులపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. మైదుకూరు గ్రంథాలయంలో పలువురు విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్నారు. ప్రతి రోజు వారు గ్రంథాలయానికి వచ్చి మంచి మంచి కథల పుస్తకాలను చదివారు. క్యారమ్స్, చెస్ వంటి గేమ్స్ ఆడారు. శుక్రవారం సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు లైబ్రేరియన్ శ్రీనివాసరావు తెలిపారు.



ప్రొద్దుటూరు కల్చరల్ : వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్

వనిపెంటలో..

వనిపెంట గ్రంథాలయంలో మే 15 నుంచి సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు పిల్లలు సమ్మర్ క్యాంప్‌లో పాల్గొని మానసిక వికాసానికి దోహదపడే పుస్తకాలను చదవడం, గేమ్స్ ఆడటం చేశారు. దేశ నాయకులపై వ్యాసరచన పోటీలు నిర్వహించామని, గెలుపొందిన వారికి సమ్మర్ క్యాంప్ ముగింపు రోజు శుక్రవారం బహుమతులను అందజేస్తామని లైబ్రేరియన్ పార్వతి తెలిపారు.

వేసవి విజ్ఞాన శిబిరం విజయవంతం

పోరుమామిళ్ల: గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరాన్ని విజవంతం చేసిన విద్యార్థులకు విశ్రాంత ఆరోగ్యవైద్యాధికారి మార్కారెడ్డి, జేవీవీ నాయకులు దాదాపీర్, గఫార్ అభినందనలు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ విజ్ఞాన శిబిరాల్లో ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాలతో విద్యార్థులు ప్రయోజనం పొందారన్నారు. శుక్రవారంతో ఈ శిబిరం ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ ఆఫ్రిది మాట్లాడుతూ విద్యార్థులు సెలవుల అనంతరం కూడా గ్రంథాలయానికి వచ్చి సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి తనిఖీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పుట్టపర్తి నారాయణాచార్యుల ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాన్ని గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ తనిఖీ చేశారు. విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరంలో నేర్పిస్తున్న నీతి కథలు, కథలు చెప్పడం, వినడం, రాయడం, గణితం, ఇండోర్ గేమ్స్, స్పోకెన్ ఇంగ్లిష్ కార్యక్రమాల గురించి గ్రంథాలయ అధికారి తిరుపతమ్మను అడిగి తెలుసుకున్నారు. చాడా మునిరెడ్డి సుమతి శతకాలను బోర్డుపై రాసి భావాలను విద్యార్థులకు వివరించారు. సంయుక్త రాణి, ఇంగ్లిష్ మాస్టర్ పవన్ కల్యాణ్ పాల్గొన్నారు.

- వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో రామేశ్వరం బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాల్లో అందించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఏడాది వేసవిలో చిన్నారులకు క్రీడలు, ఆటపాటలు, ఇంగ్లీషు నేర్పించేందుకు ఈ శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. విశ్రాంత వైమానిక దళ అధికారి వెంకటకొండయ్య, ఉపాధ్యాయురాలు నిర్మలజ్యోతి పర్యావరణం, గాలి, నీరు, శబ్దం, అడవులు పరిరక్షణ గురించి వివరించారు. అధ్యాపకులు చెంద్రాయుడు, వెంకటస్వామి, గ్రంథాలయం రికార్డు అసిస్టెంట్ ఇబ్రాంసాహెబ్ పాల్గొన్నారు.


పోరుమామిళ్ల: మాట్లాడుతున్న జేవీవీ నాయకులు గఫార్


మైదుకూరు గ్రంథాలయంలో ఆట వస్తువులతో ఆడుకుంటున్న పిల్లలు

చినుకుతో చిగురిస్తున్న ఆశలు


రాజోలి ఆనకట్ట నుంచి కుందూనదిలోకి పోతున్న నీరు

రాజుపాళెం : కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు అన్నదాతలో ఆశలు చిగురింపజేస్తున్నాయి. ఖరీఫ్‌కు ఈ వర్షం ఊపిరిపోస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులుగా రాజోలి ఆనకట్టలో అడపాతడపా నీరు పారుతూ ఉండేది. అయితే ప్రస్తుతం కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పలు గ్రామాల్లో కురుస్తున్న వర్షం నీరంతా రాజుపాళెం మండలంలోని రాజోలి ఆనకట్టకు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో రాజోలి ఆనకట్ట, కుందూనది ప్రాంతంలో జలకళతో పాటు చల్లని ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. గతంలో ఆనకట్టలో 600 క్యూసెక్కులు మాత్రమే ఉండగా గురువారం ఆనకట్ట నుంచి కుందూనదిలోకి 7,189 క్యూసెక్కులు నీరు పోతోందని కేసీ కెనాల్ అధికారులు తెలిపారు. ఇది వర్షం నీరేనని, రైతులు గమనించాలని అధికారులు సూచించారు.


టంగుటూరు గ్రామ సమీపాన కుందూనదిలో పోతున్న వర్షం నీరు

తాగునీటి సమస్య పరిష్కరించండి

మున్సిపల్ కమిషనర్‌కు వినతి

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలో పది రోజులుగా నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ నాయకులు ఎం.చిన్ని మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని సుమిత్రానగర్, సుందరయ్యకాలనీ, రిక్షా కాలనీ, శివానగర్, పూసలవాడ, మార్తోమానగర్, త్యాగరాజకాలనీలతో పాటు మరికొన్ని కాలనీల్లో గత పది రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నీరు సరఫరా కాని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా కూడా మున్సిపల్ అధికారులు నీరు అందించడం లేదని అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ బ్రహ్మంసాగర్‌లో మోటార్లు మరమ్మత్తులకు గురికావడం వలన తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తాయని, వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే సమస్య ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్లను పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగార్జున, మస్తాన్‌షరీఫ్, మోక్షమ్మ, రామలక్షుమ్మ, కొండయ్య పాల్గొన్నారు.


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పచ్చిరొట్ట సాగు.. భూసారం బాగు


ఖాజీపేట : ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏఓ నాగార్జున


అట్లూరు: శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ నాగరాజు

ఖాజీపేట : రైతులు రసాయన ఎరువులు ఇష్టానుసారంగా వాడడం వలన భూ సారం తగ్గుతోందని ఖాజీపేట మండల వ్యవసాయాధికారి నాగార్జున ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో దిగుబడి తగ్గుతోందన్నారు. భూసారాన్ని పెంచేందుకు రైతులు పచ్చిరొట్ట ఎరువులను వాడాలని సూచించారు. అందుకు అనుగుణంగా ఆర్బీకే కేంద్రాల్లో 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పచ్చిరొట్టి విత్తనాలు కావాల్సిన రైతులు వెంటనే ఆర్బీకేల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఖాజీపేట మండలానికి 370 క్వింటాళ్ల జీలుగలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. అయితే విత్తనాల కొరత కారణంగా 150 కింటాళ్ల విత్తనాలు మాత్రమే వచ్చాయని, దరఖాస్తు చేసుకున్న రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు. ఖాజీపేట మండలానికి అదనంగా 150 క్వింటాళ్ల మంజూరు చేశారని పేర్కొన్నారు. ఎకరానికి 10 కేజీలు 50 శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేస్తామన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

మండలంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాదారులు ప్రభుత్వ నిబంధనల మేరకు విక్రయించాలని సూచించారు. ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖాజీపేట లోని పలు విత్తన దుకాణాలను ఆమె పరిశీలించారు. ఎరువుల ధరలు, మందుల స్టాక్ మొత్తం పట్టిక రూపంలో ఉండాలని సూచించారు.

వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండాలి

గోపవరం : మండలంలోని రైతుభరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న వ్యవసాయ సిబ్బంది నిత్యం రైతులకు అందుబాటులో ఉండాలని బద్వేలు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. ఏఓ రామకృష్ణయ్యతో కలిసి బద్వేలు అర్బన్ రైతుభరోసా కేంద్రంలో సిబ్బందికి శిక్షణ, సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని భూసారవంతం కోసం సబ్సిడీ ద్వారా రైతులకు ఇచ్చే జీలగలు, జనుములు విత్తనాలకు సంబంధించి, రసాయనిక ఎరువుల సరఫరా, ప్రణాళిక వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. వర్షాల సీజన్ ప్రారంభం కావడంతో పంటల సాగుపై రైతులకు సాంకేతిక సలహాలు ఇవ్వాలని, అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు ఆర్బీకే కేంద్రాల్లో ఉన్న రిజిస్టర్లను సక్రమంగా ఉంచుకోవాలన్నారు. పంటలు సాగు చేసే ముందు విత్తనశుద్ధి, ఉత్తమ యాజమాన్య పద్ధతులు అవలంబిచేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు.

సిబ్బంది అందుబాటులో ఉండాలి

అట్లూరు: రైతు భరోసా కేంద్రాలలో సహాయకులు రైతులకు అందుబాటులో ఉండాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు సూచించారు. బద్వేలు అర్బన్ రైతు భరోసా కేంద్రంలో గురువారం మండల వ్యవసాయ అధికారి జి.రామకృష్ణాయ్యతో కలసి రైతుభరోసా సహాయకులకు 2024 ఖరీఫ్‌సాగు సమాయత్తంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లపెసర, జనుము, జీలగలు వంటి పచ్చిరొట్టి ఎరువుల విత్తన పంపిణీ, రసాయన ఎరువులు సరఫరాపై సమగ్రంగా చర్చించారు. ప్రస్తుత సీజన్ రైతులకు చాలా ఆశాజనకంగా ఉందన్నారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సిబ్బంది రైతులకు సహకరించాలని సూచించారు.

24 మంది దివ్యాంగ పిల్లల గుర్తింపు

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు మండల స్థాయిలో దివ్యాంగ పిల్లల గుర్తింపు సర్వే చేస్తున్నామని, ఇప్పటి వరకు 24 మంది దివ్యాంగ పిల్లలను గుర్తించామని ఐఈఆర్పీలు సంగీతలక్ష్మి, లక్ష్మిరెడ్డి తెలిపారు. సమగ్రశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖాధికారులు సావిత్రమ్మ, శోభారాణి ఆదేశాల మేరకు ఈ సర్వేను నిర్వహిస్తున్నామని వారు పేర్కొన్నారు. 1 నుంచి 18 ఏళ్లలోపు గల దివ్యాంగ పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలలో ఎన్‌రోల్ చేయడం, 21 రకాల వైకల్యాల పిల్లలను గుర్తించి వారికి భవిత కేంద్రంలో తగిన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వారు వైకల్యాన్ని అధికమించి సాధారణ పిల్లల వలే తమ పనులను తాము చేసుకోవడం, వారిలోని నైపుణ్యాలను వెలికి తీయడం, ప్రభుత్వం అందించే అలవెన్స్‌లను వారి తల్లుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ సర్వే జూన్ 9వ తేదీ వరకు కొనసాగుతుందని, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాల్లో సమాచారాన్ని సేకరిస్తున్నామన్నారు.


దివ్యాంగ పిల్లల గుర్తింపు సర్వే చేస్తున్న ఐఈఆర్పీలు సంగీతలక్ష్మి, లక్ష్మిరెడ్డి

పరిసరాల శుభ్రతతో దోమల నివారణ

ప్రొద్దుటూరు క్రైం : పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే దోమలు వృద్ధి చెందకుండా నివారించవచ్చని కామనూరు వైద్యాధికారి హనీఫ్‌బాబా తెలిపారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా గురువారం చౌడూరు గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పనికిరాని డబ్బాలు, ప్లాస్టిక్ బాటిళ్లు, తొట్లలో వర్షపు నీరు నిలువ ఉండటం వలన కలిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. దోమలు వృద్ధి చెందితే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా తదితర వ్యాధులు వస్తాయని డాక్టర్ తెలిపారు. జ్వరంతో బాధపడుతున్న వ్యక్తిని కుట్టిన దోమ ఇతరులకు కుట్టడం వలన వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతున్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, సీహెచ్ఓ గౌతమి, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఏఎన్ఎం వేదవతి, ఆశా వర్కర్లు పద్మావతి, సంజమ్మ, వెంకటసుబ్బమ్మ, డీఈఓ దేవరాజ్, ఫైలెట్ రామనాథ్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధి గ్రస్తులకు బీసీజీ వ్యాక్సిన్

పట్టణంలోని టీబీరోడ్డు యూపీహెచ్‌సీ పరిధిలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా 18 ఏళ్లు పై బడిన వారికి వయోజన బీసీజీ వ్యాక్సిన్ వేశారు. షుగర్ వ్యాధి గ్రస్తులకు, పొగ తాగువారికి, గతంలో టీబీ వచ్చిన వారి కుటుంబ సభ్యులకు వ్యాక్సిన్ వేసినట్లు డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ శంకరయ్య తెలిపారు. అలాగే అంగన్‌వాడి కేంద్రాల్లో బీసీజీ వ్యాక్సిన్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్ వైజర్ బీ రాజారత్నం, సీఓ ఎంవీ సుబ్బారెడ్డి, టీబీహెచ్‌వీ సిద్దారెడ్డి, ఏఎన్ఎం గృహలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


చౌడూరు గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ఇంటర్ అడ్మిషన్లపై దృష్టి పెట్టండి

వేంపల్లె: ఇంటర్ అడ్మిషన్లపై అధ్యాపకులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రొద్దుటూరు ఉప విద్యాశాఖ అధికారి కృష్ణయ్య కోరారు. గురువారం స్థానిక జిల్లా బాలికల ప్లస్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. అలాగే ఇంటర్ అడ్మిషన్లపై పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. అడ్మిషన్లు ఎక్కువగా అయ్యే విధంగా ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శ్రీనివాసులు స్థానిక మదీనాపురంలో ఇంటర్ విద్యార్థుల ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు.

ఆకేపాటికి సన్మానం


ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బద్వేలు అర్బన్ : రాజంపేట అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డిని గురువారం బద్వేలులో ఘనంగా సన్మానించారు. విజయవాడలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో పాల్గొని తిరుగు ప్రయాణంలో బద్వేలు మీదుగా రాజంపేటకు వెళుతున్న ఆయనను స్థానిక పోరుమామిళ్ల బైపాస్‌రోడ్డులోని బంగారుశీనయ్య ఆసుపత్రిలో వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారుశీనయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఈగయద్దారెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోలాకొండయ్య, యువజన విభాగం నాయకులు నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

22న ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో ఈ నెల 22న సాయంత్రం 4 గంటలకు గాజులపల్లె పెద్ద సుబ్బమ్మ, పెద్ద సుబ్బయ్య సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22న ప్రతిభా పురస్కారాలను అందించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు రామచంద్రుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదివి ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.2,116 ద్వితీయ బహుమతిగా రూ.1,116 లను అందిస్తామన్నారు. అలాగే 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సుమతి పద్యాలు, దేశభక్తి గీతాలాపన, చిత్రలేఖనం పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతిభ గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9849095213కు సంప్రదించాలని కోరారు.

బీజేపీ విజయోత్సవసంబరాలు

చెన్నూరు : నరేంద్ర మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా చెన్నూరులో మండల బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు.

గంగమ్మ ఆలయ చైర్మన్ రాజీనామా

చింతకొమ్మదిన్నె : మండలంలోని చింతకొమ్మదిన్నె గంగమ్మ తల్లి దేవస్థానం ఆలయ చైర్మన్ పదవికి పీటీ విశ్వనాథరెడ్డి గురువారం రాజీనామా చేసినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి మీకు సురేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకపోవడంతో తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. తన రాజీనామా పత్రాన్ని ఆయన ఆలయ కార్య నిర్వహణ అధికారికి అందజేశారు.